కథానిక:

# స్వేచ్ఛకోసం

శ్రీ ఎ. ఎస్. రామారావు.

నా చిన్నతనంలోనే మా అమ్మ చనిపోయింది. మా అమ్మ వంట్లో చికాగ్గా వున్నప్పుడే అమ్మకు ఉపచారాలు చెయ్యటానికని మా అత్త వచ్చింది. కాని భగవంతుడికి మామీద దయకలగలేదు. అమ్మ చనిపోయింది. నన్ను చూసే దిక్కెవ్వరూ లేరని మా అత్త మా యింటనే వుండిపోయింది. తల్లిలేని కొరత కనిపించకుండా నన్నెంతో గారాబంగా చూసేది. మా నాన్నవన్నీ ప్రాచీన సాంప్రదాయాలూ, పూర్వాచారాలూను. అంచేత ఎందరెన్ని చెప్పినా, సవతితల్లి పోషణలో, నాకేం ముప్పువాటిల్లుతుందోనని రెండో పెళ్ళి చేసుకోటానికి మనస్కరించలేదు.

ఇలా రెండేళ్ళు గడిచేయి. నాకు పెళ్ళి చెయ్యాలని, ముఖ్యంగా తన అజమాయిషీలో నా పెళ్ళి జరగాలని మా అత్త ఎంతో ఉబలాట పడుతూండేది. నాన్నతో ఎన్నిసార్లు చెప్పినా, ఆయన ఆ మాటలన్నీటినీ పెడచెవిని పెట్టేవాడు. అయినా, అత్త మనస్సులో ఈ ఒక్క కోరిక పీక్కుతింటూన్నట్టు నాకు కనిపించేది.

ఆ కాలంలో పన్నెండేళ్ళ లోపుగా స్త్రీకి వివాహం జరక్కపోతే లోకం నిందించేది. అప్పటి శాసనాలూ, వాటిని సమర్థించే మనుషుల్ని చూసే నాకు ఒళ్ళు మండి పోయేది. కాని నేనేం చెయ్యగలను? ఆ శాసనాల్ని ధిక్కరించే వాళ్ళెవ్వరూ లేరా కాలంలో, పొరపాటున నేలాంటి వాళ్ళెవరైనా వుంటే, వారిని సంఘం పేరు చెబుతూ ఈ పెద్దలంతా బహిష్కరించే వారు. ఈ సాకుతో మా అత్త నాకు త్వరగా పెళ్ళి చెయ్యమనీ, ఇప్పటికే. లోకం ఎంతో నిందిస్తోందనీ, నాన్నతో చెప్పడం మొదలెట్టింది. పైగా నాన్న నాకు వివాహం చెయ్యటానికి నిశ్చయించు కున్నాడు.

నాకు పెళ్ళయిన మరుచటి సంవత్సరమే అత్తవారింటికి వెళ్ళేను. వెళ్ళటానికి ముందు మా అత్త నా గురించి పొందిన శ్రమ, విచారం ఇంతని చెప్పలేను. పాపం, నన్ను ఒంటిగా విడవటానికి ఆమెకు మనస్సు రాలేదు. కాని, ఆడదై పుట్టిన తరువాత తప్పుతుందా? అయినా సరే, విధి నాకెదురు తిరిగింది. అత్తవారింటికెళ్ళిన ఆరు నెలల్లోనే నా ఐదోతనాన్ని తీసుకుని నా భర్త చక్కాపోయేడు. ఒకప్రక్క ఎండి మోడైన జీవితాన్ని, శూన్యంగా మిగిలిన జీవితాన్ని తల్చుకుని నేను నాలో కుమిలిపోతుంటే, లోకం పేరుతో వ్యవహరిస్తున్న కాకుల మూకల సూటి పోటి మాటలు నా హృదయాన్ని మరింతగా గాయపరిచేయి. మెట్టినింట్లో వుండడం దుర్భరంగా మారింది. "నా" అన్న వస్తువు పోయిన తరువాత నన్నక్కడెవరు చూస్తారు? అంచేత తిరిగి పుట్టింటికే వచ్చాను.

ఆ కాలంలో భర్త చనిపోతే భార్యకు తల తీయించే అలవాటు వుంది. అసలీ అలవాటుని ఎవరు సృష్టించేరో నాకు తెలియదు కాని, ఈ శాసనాల్ని అక్షరాలా ఆచరణలో పెడుతున్న అనేక మందిని స్వయంగా చూసేను. అంచేత నాకూ తల తీయిస్తారేమోనని భయమేసింది. తల తీయించ కుండా వుండటానికి లెక్కలేనన్ని. దేవుళ్ళను ప్రార్థించే దాన్ని. బారెడు పొడుగున ప్రేళ్ళాడే నా నల్లని శిరోజాల్ని చూసి మురిసిపోయ్యేది మా అత్త. మా అత్త మొగుడు కూడా ఆమె తొమ్మిదోపట చనిపోయేడట. అత్తకు చిన్నప్పుడే నిర్బంధంమీద తల తీయించారు. ఆమె ఎలాగో ఇంత వరకూ కాలం గడుపుకుంటూ వచ్చింది. తనకు మల్లె నాకుకూడా తలతీయిస్తారేమోనని ఆమెకు భయం. అంచేత, మా నాన్న నా తల ఎన్నిసార్లు తీయించేస్తానన్నా, ఆడదానిగా అన్ని కష్టాలనూ అనుభవించిన మా అత్త ఒప్పుకునేది కాదు. ఎలా అయితేనేం అత్త మాటలకు కట్టుబడిపోయేడు మా నాన్న.

రోజులు గడుస్తున్నాయి. మా అత్తకు నన్ను చదివించాలని బుద్ధి వుట్టింది. నిజం చెప్పాల్సి వస్తే నాకూ చదువుకోవాలనే వుండేది. కాని, మా నాన్న ఈ

పరిస్థితుల్లో ఏమంటాడోనని భయం. ఆ మాట ఒక నాడు అత్త మా నాన్న చెవిని పడేసింది. దాంతో మా నాన్న "కులాచారాన్ని ధిక్కరించి ఇదివరకు చెప్పిందానికి వూరుకున్నాను. స్కూల్లో కూడా ప్రవేశపెట్టమంటావా" అంటూ అత్త మీదకు కస్సున లేచాడు. అంతేకాక "స్కూల్లో ఆడపిల్లలు చదువుతే పాడయిపోతారు; ఆడవాళ్ళు అసలు చదువుకో కూడదు" అన్నారు కోపంగా. అన్నీ చచ్చుసిద్ధాంతాలే నాన్నవి. పైగా పట్టుదల కూడాను.

"అమ్మాయి భవిష్యత్తు ఇక దానిమీదే ఆధారపడి వుంది.మనకూ వయస్సుమళ్ళింది. అందుచేత పిల్ల దాని క్షేమం కోరయినా మనం కొంత వరకూ మూఢ నమ్మకాల్ని ఎదుర్కోవల్సి వుంటుంది" అంది అత్త నాపై అభిమానాన్ని కనపరుస్తూ. ఆమె మాటలు నాలో నూతనోత్తేజాన్ని కలిగించాయి.

నాచేత చాలా షరతులకుఒప్పించి నన్నుస్కూల్లో చేర్పించాడు మానాన్న. ఆ షరతులకు నేను అంగీకరించాను.

స్కూల్లో లీల ఒక్కర్తే నాకు ప్రియ స్నేహితురాలు. ఆమెను చూడకుండా ఒక్కరోజైనా వుండలేక పోయేదాన్ని. రోజూ విశ్రాంతి సమయంలో స్కూలుకు వాళ్ళ ఇలు దగ్గరగా వుండటం చేత వాళ్ళింటికి వెళ్ళి సరదాగా కాలం గడిపేదాన్ని.

లీల ఇంట్లో వాళ్ళ అమ్మా, అన్నయ్య డాక్టరు రాంబాబు వుండేవారు. లీల తల్లి మొదటిభర్త చని పోతే, తిరిగి వివాహం చేసుకుంది. అప్పుడే లీల, రాంబాబు పుట్టేరు. తరువాత కొంతకాలానికి రెండో భర్త కూడాచనిపోయేడు. సంఘాచారాలకు భిన్నంగా వ్యవహరించి నందుకు అంతా వాళ్ళను అదోలా చూసేవారు. అందరితోపాటుగా మానాన్నకూడాను. లీల వాళ్ళింటికి వెళ్తానని మా నాన్నకు తెలియదు, లేకపోతే ఆనాడే నన్నేం చేసి వుండేవారో!

ఒక రోజున లీల స్కూలుకు రాలేదు. నాకు కారణం యేమీ తెలియదు. మనసు లీలను చూడటానికి ఆతృత పడసాగింది. ఎలాగో విశ్రాంతి సమయం వరకు ఓర్చాను. తరువాత తిన్నగా లీల ఇంటికి వెళ్ళేను. ఇంట్లో రాంబాబు తప్ప ఇంకెవ్వరూ లేరు. ఆనాటివరకూ రాంబాబుని చూడటం కాని, మాట్లాడ్డంకాని తటస్థించలేదు. ఎందుచేతనంటే, మా నాన్నకు ద్రోహం చేసిన దాన్నవుతానేమోనని. కాని ఆరోజున "లీల ఇంట్లో లేదా?" అని అడగక తప్పింది కాదు. అంతే. "ఎక్కడికో వెళ్ళింది. వచ్చేవేళయింది కూర్చో" మంటూ కుర్చీని చూపించేడు. అలసటగా వుండటంచేత వెంటనే తిరిగి రాలేక తల వంచుకుని కుర్చీలో కూర్చున్నాను.

చలివెయ్యాటం, ఒళ్ళు ఒణకడం ఆరంభించింది. ఏదో చెప్పలేని భయం వేసింది. ఇక తప్పదు కనుక "రాంబాబూ" అన్నాను ఒణుకుతున్న గొంతుకతో. ఏదో పుస్తకాన్ని దీక్షగా చదువుకుంటూన్న అతను ఒక్కసారిగా నన్నూ, నా పరిస్థితిని చూసి తొందరగా నావద్దకు వచ్చేడు, నన్ను నెమ్మదిగా లేవనెత్తి, మెల్లగా మంచంపైన పరుండ బెట్టేడు. మెడ వరకూ దుప్పటి కప్పేడు. ఇంతలో లీలగొంతు వినిపించింది. "లీలా" అని పిల్చాను గట్టిగా. పరుగున వచ్చి లీల నాదగ్గర కూర్చుంది. రాంబాబు ఏదో మందు కలిపి తాగమంటూ నవ్వుతూ నాచేతి కందించేడు. అతని ముఖాన్ని, ఆ చిరునవ్వునూ చూస్తుంటే నాలో ఏవో భయమూ, సిగ్గూ పుట్టు కొచ్చేయి. మందు తీసుకున్న కొంచెం తేరుకున్నట్లనిపించింది. లీలనువచ్చి మా ఇంటికి దిగబెట్ట మన్నాను. లీల. రాంబాబు ఇద్దరూకలిసి నన్ను మా ఇంటికి తీసుకు వచ్చేరు.

ఆ రోజల్లా మా నాన్న నన్నదోలా చూసేడు. మానాన్న కేదో తీరని ద్రోహం చేస్తున్నట్లనిపించింది నాకు. అంచేత ఆ మరుచటి దినమేలీలతో "ఈ రోజు నుంచీ నన్ను పూర్తిగా మర్చిపో" అని ఖచ్చితంగా చెప్పేసేను. "నేను మరవలేక పోయినా, మా అన్న నిన్ను తప్పక మరుస్తాడులే" అంది లీల సరసంగా. అప్పుడదోలా అనిపించిందినాకు.

"ఏమీ తోచక మంచంమీద పడుక్కున్నాను ఆ సాయంత్రం. మా నాన్న తొందర తొందరగా వచ్చి "నా గౌరవం పాడు చేశావు. నాకు అవమానం తెచ్చావు. వద్దంటూన్న స్కూల్లో ప్రవేశ పెట్టించేవు, ఏంచూసుకుని తలెత్తుకు వీధిలో తిరిగేది?" అంటూ అత్తను నానా చివాట్లుపెట్టి నా దగ్గరకు వచ్చేడు. ఆ మండుతున్న శరీరం, నిప్పులు కక్కుతున్న కళ్ళనీ చూస్తే భయం వేసింది. మా అత్త అడ్డురాక పోతే ఆ రోజు నన్ను చంపేసేవాడే.

"రాంబాబు ఒక్కడూ వున్నప్పుడు వాళ్ళింటికి ఎందుకెళ్ళావ్? వాడితో ఎందుకుమాటాడేవ్? ఎవరూ

లేనప్పుడూ వెంటనే తిరిగి రాలేకపోయావా? అసలు వాళ్ళింటి కెళ్ళాల్సిన అవసరం ఏమొచ్చింది? వాళ్ళింటికి వెళ్ళొద్దని చెప్పానా. లేదా," అంటూ ప్రశ్నల వర్షం కురిపించి నా సమాధానం విన కుండానే ఇంట్లోంచి వెళ్ళిపోయేడు. సమాధానం ఇవ్వటానికి నానోరు కదల్తేగా !

"లీల ఇంట్లో జరిగిందెవరికి తెల్సు? ఎవరైనా నా మీద కిట్టనివాళ్ళు అనరాని మాటలు నాన్నతో చెప్పి వుండాలి. లేకపోతే వాళ్ళింటి కెళ్ళినట్లు నాన్నకెలా తెలుస్తుంది. అందులోను నాన్నకు నేనంటే తగని అభిమానం. నాన్నకు ద్రోహం చెయ్యటానికి తలపెడతానా?" అంటూ పొంగిపొరలు కొస్తున్న దుఃఖంతో అత్తతో చెప్పేను. అత్త నన్ను ఓదార్చి "నాన్నకు నచ్చజెప్తాలే" అని భరోసా ఇచ్చింది. అత్తకి నా మీద గల అభిమానాన్ని, ప్రేమను తల్చుకుంటే నామనస్సు ఉప్పొంగుతుంది. మనసులోనే అత్తకు ధన్య వాదా లర్పించు కున్నాను.

రాత్రి పదిగంటలైంది. నాన్న భోజనం చేసివచ్చి గదిలో కూర్చున్నాడు. అత్త చెప్పినట్టుగానే గదికివతల తట్టున పొంచి నిల్చున్నాను. నాన్నకు కనిపించకుండా కిటికీలోంచి వింటున్నాను. అత్త నా గురించి ఎన్నో విధాలుగా నాన్నకు నచ్చచెప్పడానికి ప్రయత్నించింది. కాని, నాన్న అత్త మాటలు లెక్కచెయ్యకుండా "ఇప్పటికే చెడిపోయింది. దానికి తప్పకుండా తల తీయించాల్సిందే, అప్పుడు దాని ముఖం చూడటానికెవరూఇష్టపడరు. అది ఆచారంకూడా" అంటూ "రేపే ఆపనికాస్తా అయిందని పించేస్తాను." అన్నాడు ఇంకా ఏవేవో మాటలు అన్నాడు. ఆ మాటలు వింటూంటే నాలో ఆందోళనతో కూడిన భయంవేసింది. ఇంతలో కిటికీప్రక్కగానుండి వింటున్న నన్ను నాన్న చూసేడు "మాటలన్నీ అమ్మాయి గోడచాటునుంచి వింటున్నదే" అన్నాడు అత్తతో కోపంగా. ఆమాటలే ఆఖరిసారిగా నాన్ననోటి నుంచి వినడం. అంతే. ఆ మాటలు వినగానే ఇల్లు వదలి వచ్చేశాను.

ఆ అర్ధరాత్రి కటిక చీకటిలో తిన్నగా లీల ఇంటికి వచ్చేశాను. ఆ ఇంట్లోవాళ్ళంతా నన్నెంతో ఆప్యాయంగా ఆదుకున్నారు. వారింట్లో నాకు సముచిత స్థానం లభించిందనే చెప్పాలి. అలా జరుగుతుందని నేను కలలోనైనా వూహించలేదు. అంతవరకూ జరిగిన కథంతా పూసగ్రుచ్చినట్లు లీల, వాళ్ళకి వివరించి చెప్పేను. ఆరాత్రే అంతాకలసి ఆవూరు విడిచి పట్నం చేరుకున్నాం.

పట్నం వచ్చినా నామనస్సు అత్తని గురించే కలత చెందేది. ఆమె నాపైచూపిన ప్రేమకు, నేనామె నెలా మరువగలను? రాంబాబు నాతో ప్రవర్తిస్తున్న తీరుచూస్తుంటే అతను నన్ను ప్రేమిస్తున్నాడని అర్థం చేసుకున్నాను, ఆనాడు తొలిసారిగా అతన్ని చూసినప్పుడే అదేదంటే నాకదోలాంటి భావం ఏర్పడింది. కాని, నాన్నకు ద్రోహం చేస్తున్నానేమోనని ఆ ఆశను ఎప్పుడో వదలుకున్నాను.

ఒకరోజు ఉదయాన అప్పుడే ముఖం కడుక్కొని ఏమితోచక ఆకాశంకేసి చూస్తూ వరండాలో వున్న కుర్చీలో కూర్చున్నాను. రెండు చేతులలో రెండు






వైద్యభాస్కర సారథీస్
హెయిర్ టానిక్

ఆయుర్వేదపద్ధతులపై తయారుకాబడిన ఔషధ రాజము. కుదుళ్ళను గట్టిపరచి కురులను, నల్లగా, గుబురుగా నిడివిగా పెంచును. నెరవనీయదు — రాలనీయదు

| | |
|---|---|
| చిన్నసీసా | రు 2-0. |
| పెద్దసీసా | రు 3-50 |

సుందరీశంకరం 64 అప్పర్‌స్వామికోవిలవీధి
మైలాపూర్ — మద్రాసు

కప్పుల కాఫీని తీసుకొచ్చి, చిన్నగా నవ్వుతూ ఒకటి నాకందిచ్చేడు రాంబాబు. ఏదో ఆశతో చూస్తున్న అతని కళ్ళనూ, చిరునవ్వుల వెనకాల ఏదో రహస్యాన్ని దాచటానికి ప్రయత్నిస్తున్న అతనిముఖాన్ని చూస్తున్న నాకు నవ్వొచ్చింది. ఎంత ఆపుకోడానికి ప్రయత్నించినానాకుసంభవంకాలేదు. ప్రత్యుత్తరంగా నేను ముసి ముసిగా నవ్వేను. రాంబాబు ఏమనుకున్నాడో ఏమో! వెంటనే తిరిగి వెళ్ళిపోయేడు. అతని తొందర పాటునుచూస్తుంటే అతనేదో అవ్యక్తానందాను భూతిని పొందుతున్నట్లనిపించింది.

రాంబాబు తిరిగి వచ్చినప్పుడు ఒక దినపత్రికను కూడా తీసుకు వచ్చాడు. తిన్నగా నాదగ్గరకు వచ్చి అందులోని ఒక వార్తను నాకు చూపించాడు. పత్రికలో ఇలా వుంది. —"గ్రామంలో శంకరశాస్త్రి అతని చెల్లెలు గంగమ్మా ఇద్దరూ ఆత్మహత్య చేసుకున్నారు. ఇల్లు సోదా చెయ్యగా శంకరశాస్త్రి తన కూతురుపేర వ్రాసిన వుత్తరం దొరికింది. ఆ వుత్తరంలో "అమ్మాయీ ! నీకునచ్చిన వాణ్ణో పెళ్ళి చేసుకుని హాయిగా, జీవించు" అని ఒక్కవాక్యమే వ్రాసి వుంది ! "ఆవార్త చదివేసరికి నాలో ఒక్కసారిగా దుఃఖం పెల్లుబికింది. వెక్కి వెక్కి ఎంతసేపు ఏడ్చానో నాకే తెలియదు.

నామీద అవాజ్యమైన ప్రేమ, అభిమానం చూపించి నాకోసం అష్టకష్టాలను అనుభవించి చివరకు ఆత్మత్యాగానికి కూడా సిద్ధపడ్డ మా అత్తను స్మరించలేకుండా ఒక్కనిమషం వుండలేకపోతున్నాను. మూఢనమ్మకాలతో స్వార్ధపరులు, స్వసుఖంకోసం సృష్టించుకున్న ఆచారాల్ని అంతవరకూ శాసనాల్లా మూర్ఖంగా నమ్మి, ఆచరణలో పెట్టడానికి ప్రయత్నించి విఫలుడై, పశ్చాత్తాపంతో; చివరకు నామీద సానుభూతిని చూపించి ఆశీర్వదించిన మా నాన్నకు జోహారులర్పించు కున్నాను. నాకోసం, నాసౌఖ్యం కోసం సంఘాచారాల్ని కాదన్న తనను లోకం నిందిస్తుందన్నభయంతో ఆత్మహత్య చేసుకున్న నాన్నగాని, అతిగారాబంగా పెంచి పెద్ద చేసినఅత్త గాని కలలోనైనా కంటబడతారేమోనని ఆశించాను. నా ఆశలన్నీ నిరాశలయ్యాయి. నామీదే తన ఆశలన్నీ పెంచుకున్న నాన్నకు ద్రోహం చేశానేమోనని కాబోలు నాన్న కనిపించలేదు. నాకు తన ముఖం చూపించడానికి అత్తకు సిగ్గేసింది కాబోలు. వారి ఆత్మలకు శాంతి కలిగించలేక పోతున్నానేమోనని సిస్తూండేది.

మాలో ఎవరు తప్పుచేసినట్లు? ఒకరికొకరు పరమ శత్రువులమైనట్టుఒకరినిఒకరు పలుకరించరేం? అయినా సరే, మామధ్య నిల్చింది ప్రేమ. దీన్ని జయించటం కోసంఎటువంటి పరిస్థితుల్నెదుర్కో వల్సివచ్చింది ! ★

